క్లుప్తంగా

కాకినాడ జిల్లాకు నాయకర్ పేరుపెట్టాలి



మహాలక్ష్మి ఆలయం వద్ద మాట్లాడుతున్న వాడ్రేవు వీరబాబు

తాళ్లరేవు: కాకినాడ జిల్లాకు ప్రముఖ దాత, దివంగత మల్లాడి సత్యలింగం నాయకర్ పేరు పెట్టాలని పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెంలో మహాలక్ష్మి ఆలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పొన్నమండ రామలక్ష్మి, మత్స్యకార నాయకుడు వాడ్రేవు వీరబాబు, వైదాడి నూకరాజు, కొపనాతి నాగరాజు తదితరులు మాట్లాడారు. ఎంతో కష్టించి సంపాదించిన యావదాస్తిని విద్యాలయాలు, దేవాలయాలకు రాసిచ్చిన మహాదాత నాయకర్ అని అన్నారు. 1,400 ఎకరాల భూమిని ధారాదత్తం చేసిన మహోన్నత వ్యక్తి నాయకర్ అని కొనియాడారు. ఈ డిమాండ్‌తో కాకినాడలో ఈ నెల 2న పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓలేటి నరసింహస్వామి, పాలెపు ధర్మారావు, సంగాడి శ్రీనివాస్, వాతాడి ఆదినారాయణ, ధర్మారావు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగం సామాజిక బాధ్యత



ఎస్సై సత్యనారాయణ దంపతులను సన్మానించిన డీఎస్పీ ప్రసాద్, సీఐలు ప్రశాంత్‌కుమార్, వీరబాబు

అల్లవరం: పోలీసు ఉద్యోగం సామాజిక బాధ్యతని, నిత్య జీవితంలో పోలీసులు కుటుంబంతో కన్నా సమాజంతో ఎక్కువ సమయం గడుపుతూ శాంతి భద్రతలను కాపాడతారని డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ అన్నారు. కోడూరుపాడులోని సత్యకస్తూరి కల్యాణ మండపంలో అల్లవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన జంగా సత్యనారాయణకు సన్మానం ఆదివారం జరిగింది. ఎస్సై సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ ప్రసాద్ హాజరయ్యారు. అనంతరం ఎస్సై జంగా సత్యనారాయణ దంపతులను డీఎస్పీ ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ట్రైనీ సీఐ వీరబాబు, ఎస్సైలు రాజేష్, బాలకృష్ణ, శ్రీనివాస్ సత్కరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అడపా శ్రీనివాసరావు, కంకిపాటి వీరబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ముత్యాల బాబి, ఈతకోట రాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఉప్పలగుప్తం: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా చిక్కం వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి పెరాయిచెరువులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. 125 మంది రోగులకు షుగర్, బీపీ, ఈసీజీ, కళ్లకు సంబంధించిన పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు.

అమలాపురం రూరల్: లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినీనటులు చిరంజీవి, పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద సహస్ర బ్లడ్ సెంటర్‌లో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. 30 మంది రక్తదానం చేశారు. లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ ఫౌండర్, అధ్యక్షుడు కొలిశెట్టి తాతాజీ, వీరలక్ష్మి దుర్గ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిచారు. ఫౌండేషన్ సభ్యులు హనుమాన్ బుజ్జి, చీకట్ల కిరణ్, ఆకుల నాయుడు, కల్వకొలను తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

మామిడికుదురు: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా జరుగుతుందని దీప్తి విద్యాసంస్థల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని, వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఔత్సాహికులు తమ బయోడేటాతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. డీఎస్‌డీఓ హరిశేషు ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా జరుగుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మామిడికుదురు: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల బీఈడీ స్టూడెంట్స్, ఆక్సిజన్ అసోసియేషన్ సంయుక్తంగా పాశర్లపూడిలో ఆదివారం ఫీల్డ్ వర్క్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్వచ్ఛభారత్‌తో పాటు తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. స్థానికులకు ఉచితంగా చెత్త బుట్టలు పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రేమజ్యోతి, ఎస్‌కేబీఆర్ కళాశాల బీఈడీ ప్రిన్సిపాల్ అంజనీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బతుకులపై ఆటోంబాంబు

- సగానికి పడిపోయిన ఆదాయం
- అప్పులు చెల్లించలేని స్థితిలో ఆటో కార్మికులు
- నియోజకవర్గంలో రెండు వేల మందిపై ప్రభావం



అమలాపురంలో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు



ఎర్ర వంతెన వద్ద ప్రయాణికులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న ఆటోలు

అల్లవరం: ఆ బండి చక్రాలు కదిలితేనే వారి బతుకులు గడిచేది.. అలాంటి కార్మికులు బక్కచిక్కిపోతున్నారు.. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన ఉచిత బస్సు పథకంతో ఆటోవాలాలు ఇబ్బంది పడుతున్నాయి. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేసిన నాటి నుంచి ఆటోలకు గిరాకీ లేక ప్రధాన సెంటర్లో ఖాళీగా దర్శనమిస్తున్నారు. నెలంతా కష్టపడితే గాని ఈఎంఐలు, ఆటో నిర్వహణ ఖర్చులు, ఇంటి అవసరాలకు సరిపోని పరిస్థితి. ప్రస్తుతం ఉచిత బస్సుతో ఆటోవాలాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈఎంఐలు చెల్లించే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఇక ఇంటి అవసరాలు, పిల్లల చదువులు, ఆటో నిర్వహణ ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తోంది. గతమంతా ఆడుతూ పాడుతూ సాగిపోయిన ఆటో కార్మికుల కుటుంబాలు కూటమి ప్రభుత్వ నిర్ణయంతో అష్టకష్టాల పాలవుతున్నాయి. అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 2 వేల మందికి పైగా ఆటో కార్మికులు ఉన్నారు. స్త్రీశక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తమకు ఉపాధి కరవైందని ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేసి ఆటోలను కొనుగోలు చేశామని, ఇప్పుడు ఈఎంఐలు చెల్లించలేకపోతున్నామని అంటున్నారు. అమలాపురం పట్టణంలో రోజుకు ఐదు నుంచి పది ట్రిప్పుల ద్వారా ఖర్చులు పోను కనీసం రూ.వెయ్యికి పైగా డబ్బులను ఇంటికి తీసుకెళ్లి పిల్లాపాపలతో సంతోషంగా గడిపేవారు. నేడు ఆ పరిస్థితి లేదని వాపోతున్నారు. రోజుకు కనీసం ఒక్క కిరాయి లేక డీజిల్ డబ్బులు కూడా రావడం లేదని చెబుతున్నారు. రోజుకు రూ. 500 కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల నుంచి ఆటో ఈఎంఐలు, ఇంటి అవసరాలకు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఉచిత బస్సులు ప్రయాణిస్తున్న రూట్లో ఆటో గిరాకీ పూర్తిగా పడిపోయిందని, పట్టణ ప్రాంతమైతే మరింత దారుణంగా ఉందని చెబుతున్నారు.

ఆదాయం తగ్గిపోయింది



ఉచిత బస్సు అమలు చేసిన నాటి నుంచి ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. మహిళలు బస్సు కోసమే ఎదురు చూస్తున్నారే తప్ప ఆటోలో ఎక్కడానికి ఇష్టపడడం లేదు. ఈ నెల నుంచి ఆటో ఈఎంఐలకు అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రోజుకి కనీసం రూ. 500 కూడా రావడం లేదు. ఇంటి ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాం.

– ముత్తాబత్తుల శ్రీనివాసరావు, సామంతకుర్రు

జీవనాధారం కోల్పోయాం



మహిళలకు ఉచిత బస్సు ప్రవేశపెట్టడంతో ఆటో వృత్తి నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులు జీవనాధారం కోల్పోయారు. మహిళలు ఉచిత బస్సు ఎక్కడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉచిత బస్సు పథకం ద్వారా ఆటో కార్మికులు చాలా నష్టపోతున్నారు. ఈ కార్మికులను ప్రభుత్వం ఆదుకోకపోతే చాలా కుటుంబాలు రోడ్డున పడతారు.

– పోతుమూడి కొండబాబు, ది ఉప్పలగుప్తం ఆటో అసోసియేషన్ అధ్యక్షుడు

జీఓ నంబరు-5పై పునరాలోచన

యానాం: ఎస్సీల సంక్షేమానికి విఘాతంగా మారిన జీఓ నంబరు- 5ను విరమించుకునేలా పునరాలోచన చర్యలు చేపడుతున్నారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ జీఓ వల్ల ఎస్సీలకు ప్రభుత్వం ద్వారా అందే వివిధ పథకాలు అందని పరిస్థితి నెలకొంటుందని, దీనిని రద్దు చేయాలని కోరుతూ ఇప్పటికే తాను నివేదిక పంపినట్లు తెలిపారు.

ఐజేయూ సభ్యుడిగా సుబ్బారావు



సుబ్బారావు

అమలాపురం రూరల్: ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) సభ్యునిగా అమలాపురానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పరసా సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికను ఐజేయూ ఎన్నికల కమిటీ ఆదివారం ధ్రువీకరించింది. ఏపీయూడబ్ల్యూజే యూనియన్‌లోనూ ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ ఎన్నికపై ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వాతిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మండెల నాగవెంకట ప్రసాద్, జిల్లా కార్యదర్శి శంకర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కొర్లపాటి ప్రదీప్, ఉమ్మడి జిల్లా పూర్వ కార్యదర్శి సుంకర ప్రసాద్, అమలాపురం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అరిగెల రుద్రశ్రీనివాసరావు, దొమ్మేటి వెంకట్ అభినందనలు తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



పాఠశాల ఆవరణలో గురువులతో పూర్వ విద్యార్థులు

కె.గంగవరం: మండలంలోని కుందూరు ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయకంగా కలుసుకుని రోజంతా ఉల్లాసంగా గడిపారు. పాఠశాలకు చెందిన 2005-06 బ్యాచ్ విద్యార్థులు ఉపాధ్యాయులతో నిర్వహించిన సమ్మేళనం ఘనంగా జరిగింది. తొలుత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులను శాలువాలు, పూలదండలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. సుమారు 28 ఏళ్ల తరువాత వివిధ ప్రాంతాల్లో ఉంటున్న స్నేహితులంతా కలుసుకొని గడిచిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషం వ్యక్తం చేశారు. విద్యను అందించిన పాఠశాలకు రూ.50 వేలతో ఆర్‌ఓ ప్లాంట్‌ను అందించారు.

విజయ భేతాళస్వామి శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణను సత్కరిస్తున్న విజయ భేతాళ స్వామి శెట్టిబలిజ సంఘ నాయకులు

అమలాపురం రూరల్: పేరూరు తోట్లపాలెంలో విజయ భేతాళస్వామి శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా బొంతు వీర వెంకటసత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానికంగా ఆదివారం జరిగిన సమావేశంలో సుమారు 500 మంది సభ్యులు పాల్గొని ఆయన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, సంఘ సలహాదారులుగా న్యాయవాదులు కుడుపూడి అశోక్, చొల్లంగి సుబ్బారామ్, ఇళ్ల ఏడుకొండలు, మట్టపర్తి బాబి, యిళ్ల రాము, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నికయ్యారు. అనంతరం సత్యనారాయణను సంఘ సభ్యులు సత్కరించారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



తాళ్లరేవు కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

తాళ్లరేవు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కేశవ స్వామివారి ఆలయ ప్రాంగణంలో శ్రీవరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజున విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు కొలను సత్యనారాయణ మూర్తి, కందికొండ బాబి, మర్ల ఫణి సుబ్రహ్మణ్యశర్మ, చావలి రవి, గుత్తెన రవిశర్మల బృందంచే గణపతి పూజ, మండపారాధన, పంచామృతాభిషేకాలు తదితర పూజలు జరిపారు. అనంతరం అష్ట ద్రవ్యాలతో లక్ష్మీగణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. అదేవిధంగా మహాలక్ష్మి, నవగ్రహ హోమాలు చేశారు. బాలాంత్రపు రవికుమార్, ఎనమండ్ర విజయ్‌కుమార్ శర్మ, కొల్లూరు రాజ్‌కుమార్, వేలూరి అక్షయ్ తదితరులు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది.

పవన్‌కుమార్‌కు సత్కారం

అమలాపురం టౌన్: పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి, పట్టణ హోటల్స్ యజమానుల సంఘ అధ్యక్షుడు నల్లా పవన్‌కుమార్ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భంగా ఆయన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. స్థానిక రాతి బడి వద్ద ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాపుల అభ్యున్నతికి కృషి

అమలాపురం టౌన్: కాపుల అభ్యున్నతి కోసం రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ దివంగత నల్లా సూర్యచంద్రరావు అహర్నిశలు కృషి చేశారని రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు నల్లా విష్ణుమూర్తి అన్నారు. సూర్యచంద్రరావు వర్ధంతి సందర్భంగా అమలాపురంలో ఆదివారం పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో విష్ణుమూర్తి పాల్గొని ప్రసంగించారు. గండువీధి కాపు కల్యాణ మండపం వద్ద సూర్యచంద్రరావు విగ్రహానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కాపు నాయకులు మెట్ల రమణబాబు, నల్లా పవన్‌కుమార్, కల్వకొలను తాతాజీ, సూదా గణపతి తదితరులు పూలమాలలు వేశారు. ఫైర్ స్టేషన్ సెంటర్, నల్లా గార్డెన్, మహిపాల వీధిల్లో సూర్యచంద్రరావు విగ్రహాలకు కాపు నాయకులు నివాళులు అర్పించారు.

లంకల్లో జలజడి

- పొంగి ప్రవహిస్తోన్న నదీపాయలు
- కాజ్‌వేపై పడవ ప్రయాణాలు
- రాకపోకలకు ఇబ్బందులు



అయినవిల్లిలంకలో కాజ్‌వే వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న తహసీల్దార్

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలో మూడోసారి వరదలు రావడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యావసరాలు, తాగునీరు కోసం పడవలు దాటి లంక ప్రజలు బయటకు వస్తున్నారు. వరదలతో లంక గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే మునిగిపోవడంతో అక్కడ పడవలు ఏర్పాటు చేశారు. లంకల నుంచి ఏటిగట్లపైకి తరలించిన పశువులకు మేత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్.గన్నవరం, శివాయలంక, కనకాయలంక గ్రామాల్లో ప్రత్యేక అధికారి జయచంద్ర గాంధీ పర్యటించి స్థానిక అధికారులకు పలు సూచనలిచ్చారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం- అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వేపై వరద నీరు ఉధృతిగా ప్రవహించడంతో పూర్తిగా మునిగింది. ఆదివారం లంక ప్రజలు రాకపోకల కోసం పడవలను అధికారులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలైన అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. కాజ్‌వే వద్ద రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బంది ఎప్పటికప్పుడు సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టలంక, కొండుకుదురు లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో అరటి, మొక్కజొన్న, తమలపాకు, కోకో, కూరగాయ పంటలు నీటమునిగాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని లంక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అధికారుల చర్యలు

కనకాయలంక కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని తహసీల్దార్ విద్యాపతి, ఎస్సై హరికోటిశాస్త్రి సమీక్షించారు. కాజ్‌వే వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టారు. రెండు పడవలను ఏర్పాటు చేసి లంక గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఆర్ఐ రాయుడు, వీఆర్వోలు వారి వెంట ఉన్నారు.

ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలి

పి.గన్నవరం మండలంలోని మానేపల్లి శివారు శివాయలంకకు వెళ్లే రహదారి రెండు కిలోమీటర్ల మేర వరదనీటతో మునిగిపోయింది. దీంతో ఆ గ్రామ ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మానేపల్లి ఏటిగట్టు నుంచి గతంలో మాదిరిగా ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నష్ట పరిహారం అందించాలి

యానాం: గోదావరిలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ పగలడంతో జరిగిన అగ్ని ప్రమాదంలో బాధిత యానాం తీర ప్రాంత గ్రామాల ప్రజలకు ఆ సంస్థ నష్ట పరిహారం అందించాలని ఆదివారం స్థానిక నాయకుడు తోట రాజు అన్నారు. స్థానిక ఫెర్రీరోడ్డులో ఊరి కోసం నేను అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పైప్‌లైన్ ప్రమాదం తీర ప్రాంతాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందని, దీనిపై ఎల్జీ కై లాషనాథన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సామాన్యులకు ఆరోగ్య సేవలు అందడం లేదని, గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని తెలిపారు.

సేవలు ప్రశంసనీయం



డీఎం సత్యనారాయణ మూర్తిని సత్కరిస్తున్న తాతబాబు, వాక్సర్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా చల్లా సత్యనారాయణ మూర్తి అందించిన సేవలు ప్రశంసనీయమని స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వాక్సర్ క్లబ్ ప్రతినిధి, సొసైటీ మాజీ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు అన్నారు. సత్యనారాయణమూర్తి ఉద్యోగ విరమణ సందర్భంగా అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆదివారం వాక్సర్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కూచిమంచి కృష్ణ, నడింపల్లి సూరిబాబురాజు, రంగారాజు పాల్గొన్నారు.

తెలుగు వెలుగులు నింపుదాం



ఐ.పోలవరంలో కవులను సత్కరించిన నిర్వాహకులు

ఐ.పోలవరం: వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నుంచి ఆదివారం వరకూ ఐ.పోలవరంలో తెలుగు వెలుగులు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ మూడు రోజులూ కూచిపూడి నృత్య ప్రదర్శనలు, కవి సమ్మేళనం, గాన విభావరి వంటి కార్యక్రమాలు జరిపారు. ఆదివారం పలువురు కవులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగు వెలుగులు నింపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పత్తి సత్తిబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, విత్తనాల వరప్రసాదరావు, ఏపీఎస్ఎన్ మూర్తి, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మైనారిటీ సెల్ అధ్యక్షుడికి అభినందన



జాన్‌వెస్లీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన బొల్లవరపు జాన్ వెస్లీని తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అభినందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శిగా నియమితులైన శామ్యూల్ సాగర్ విశాఖపట్నంలో జాన్ వెస్లీని మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సత్కారం



భీమనపల్లిలో సత్తిరాజు, గంగాభవాని దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మాజీ సర్పంచ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు శిరంగు గంగాభవాని దంపతులకు కొలపల్లి ఈశ్వర భగవాన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం ఘనంగా పౌర సన్మానం నిర్వహించారు. సత్తిరాజు కుటుంబీకులు గ్రామానికి చేసిన సేవలకు భీమనపల్లిలో ఆయన నివాసంలో గ్రామస్తులంతా సత్తిరాజు దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్య, వైద్యానికి సత్తిరాజు కుటుంబీకులు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, మాజీ ఎంపీపీ శిరంగు రాజా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచులు యాళ్ల లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ ఆకేటి పెద్ద, గ్రామస్తులు ఆకేటి బాబులు, ఇళ్ళ కృష్ణ, కోలపల్లి పట్టాభిరాముడు, గంధం బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దాండియా నృత్యం



దాండియా నృత్యం చేస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: పట్టణంలో ఉన్న దాదాపు 70 అపార్ట్‌మెంట్‌ల వాసులు తమ సెల్లార్లలో వినాయకుడిని నిలబెట్టి రోజూ సాయంత్రం పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే స్థానిక యర్రమిల్లి వారివీధిలోని ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఫ్లాట్‌దారులు ఆదివారం సాయంత్రం వినాయక ప్రతిమ వద్ద పూజలు చేశారు. అక్కడ మహిళలు దాండియా నృత్యం చేసి అలరించారు. ఈ నవరాత్రులూ సాంస్కృతిక ప్రదర్శనలతో గణపతిని కొలుస్తున్నారు.

బాలికల కోలాటం

ఉప్పలగుప్తం: స్థానికంగా అర్చకుడు భైరవభట్ల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించారు. గొల్లవిల్లిలో గణపతి నవరాత్ర మహోత్సవాల్లో బాలికల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎస్.యానంలో వినాయక లడ్డూను వేలం పాటలో రూ. 10 వేలకు చీకట్లో సత్యనారాయణ దక్కించుకున్నారు.

ప్రశాంతంగా రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో ఖాళీగా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. యానాం రీజియన్‌లో మొత్తం ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, 1,953 మంది అభ్యర్థులకు 1,502 మంది హాజరయ్యారని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి తెలిపారు. రాత పరీక్షకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ఇద్దరిని పరీక్షకు అనుమతించ లేదు. తాము హైదరాబాద్ నుంచి బస్సులో వచ్చామని, దీంతో ఆలస్యం అయ్యిందని తెలిపినప్పటికీ సిబ్బంది అనుమతించకపోవడంతో అభ్యర్థులు నిరాశతో వెనుదిరిగారు.

అక్టోబర్ నెల కోటా విడుదల

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యం జరిగే కల్యాణాలకు అక్టోబర్ కోటాను ఆదివారం విడుదల చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌కు సంబంధించి 3,596 కల్యాణాలకు గాను ఆన్‌లైన్‌లో 2,128, ఆఫ్‌లైన్‌లో 1,468 అందుబాటులో ఉంటాయన్నారు.